క్లుప్తంగా

క్షతగాత్రుడిని ఆదుకున్న రోడ్డు సేఫ్టీ మొబైల్ సిబ్బంది



క్షతగాత్రుడిని 108లో హాస్పిటల్‌కు తరలిస్తున్న రోడ్డు సేఫ్టీ మొబైల్ సిబ్బంది

ఏలూరు టౌన్: జాతీయ రహదారి–16పై ఏలూరు సమీపంలోని దుగ్గిరాల గ్రామం వద్ద ఒక వ్యక్తి దెబ్బలతో పడి ఉన్నాడనే సమాచారంతో పోలీస్ రోడ్డు సేఫ్టీ మొబైల్ సిబ్బంది వెంటనే స్పందించారు. గాయాలతో ఉన్న వ్యక్తిని వెంటనే ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. విషయం తెలియగానే మొబైల్ బృందం ఏఎస్సై మూర్తి తన సిబ్బందితో కలిసి ప్రమాద స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. పోలీస్ సిబ్బంది వెంటనే స్పందిస్తూ భిక్షాటన చేసుకునే వ్యక్తిని రక్షించటంపై ప్రజలు అభినందిస్తున్నారు.

1 నుంచి ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనం

ఏలూరు (టూటౌన్): వచ్చే నెల ఒకటో తేదీ నుంచి మూడు రోజుల పాటు వైజాగ్‌లో నిర్వహించనున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే, జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు ఆదివారం డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి ఏఐటీయూసీ ప్రతినిధులు సుమారు 500 మంది మూడు రోజుల పాటు సమ్మేళనాల్లో పాల్గొంటారన్నారు. సెప్టెంబరు 3న మధ్యాహ్నం వైజాగ్‌లో మహా కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

గ్రామాల్లో విజృంభిస్తున్న జ్వరాలు

భీమడోలు: గుండుగొలను, భోగాపురంలో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్య లోపం, మంచినీటి సమస్యల నేపథ్యంలో ఇంటింటా ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. ఇంట్లో ఒకరి తర్వాత మరొకరిని జ్వరాలు వేధిస్తున్నాయి. గుండుగొలను శివారు భోగాపురంలో జ్వరాలు కలకలం రేపుతున్నాయి. పీహెచ్‌సీ దూరంగా ఉన్న శివారు ప్రాంతాలకు క్షేత్రస్థాయి సిబ్బంది తప్ప వైద్య బృందం పర్యటించలేదని స్థానికులు వాపోతున్నారు. రోగులకు వైద్య సేవలందిస్తున్నామని వైద్యాధికారిణి కె.శ్రీలక్ష్మి చెప్పారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై సర్వే చేసి వారికి అవసరమైన మందులను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను ముమ్మరంగా చేపడుతున్నామని ఈవోఆర్‌డీ ఏ.సుందరి తెలిపారు.



మహిళా వైద్యులకు అండగా నిలవాలి



ప్రభుత్వ బోధనాసుపత్రులు, మెడికల్ కళాశాలల్లో పనిచేస్తున్న మహిళా వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి ప్రభుత్వం అండగా నిలవాలి. మహిళా వైద్యులకు భద్రత కల్పించటంతోపాటు, ఏదైనా వైద్య చికిత్సల సమయంలో రోగి మరణిస్తే దాన్ని వైద్యులపై నేరం మోపుతూ రోగి బంధువులు దాడులు చేయటం, హాస్పిటల్స్‌ను ధ్వంసం చేయటం వంటి వాటికి పాల్పడకుండా చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ దిరిశాల వరప్రసాదరావు, మాజీ ఏపీ మెడికల్ బోర్డు డైరెక్టర్

కఠిన చట్టాలు రూపొందించాలి



వైద్యులు, వైద్యశాలలపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. బాగా నష్టం జరిగినప్పుడు, ఎవరైనా చనిపోయినప్పుడు వారం రోజులు నిరసన, కొవ్వొత్తులతో ర్యాలీ, సమ్మెలు చేయడం తదనంతరం మరిచిపోవడం నిత్యకృత్యమవుతోంది. వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులు, హత్యలు, దౌర్జన్యాలను అరికట్టేందుకు కఠిన చట్టాలు రూపొందించాలి. వాటిని కచ్చితంగా అమలు చేయాలి.

– కె.విజయభాస్కర్, కంటి వైద్యుడు, దెండులూరు సీహెచ్‌సీ

పెరుగుతున్న పిరమిడ్ సంస్కృతి

- ఇళ్లపై పిరమిడ్లు నిర్మించి ధ్యానం
- ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, సంకల్ప శక్తి పెరుగుతుందంటున్న ధ్యానులు
- పిరమిడ్ ధ్యాన వైపు ప్రజల ఆసక్తి

ఏలూరు రూరల్: నగరంలో పిరమిడ్స్ నిర్మాణాలపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఇళ్లు, భవనాలు, పార్కులు. ఖాళీ స్థలాల్లో సైతం పిరమిడ్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. మరికొందరు ధ్యానులు పిరమిడ్లకు బంగారు పూత, రంగు సైతం వేస్తున్నారు. పల్లెల్లో వెదురుకర్రలతో సైతం పిరమిడ్ ఏర్పాటు చేసుకుంటున్నారు. మొదట పదుల సంఖ్యలో ఉన్న పిరమిడ్స్, ఇప్పుడు వందల సంఖ్యలో చేరుతున్నాయి.

పెరుగుతున్న ఆసక్తి

పిరమిడ్ కింద ధ్యానం చేయడం వల్ల అనారోగ్య సమస్యలు తగ్గడంతో పాటు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, సంకల్ప శక్తి పెరుగుతుందని, దీంతో పాటు మనస్సు ప్రశాంతంగా ఉంటుందని పలు సొసైటీల సభ్యులు ప్రజలకు వివరిస్తున్నారు. దీంతో ప్రజలు ఈ సొసైటీల్లో సభ్యులుగా చేరుతున్నారు. ఇందులో ఉన్నత విద్యావంతులు నుంచి సాధారణ ప్రజలు సైతం ఉన్నారు. వీరందరూ పిరమిడ్ కింద ధ్యానం చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. శాఖాహారులు మారుతున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం దీని కింద కూర్చొని ధ్యానం చేస్తున్నారు. మరికొందరు ఔత్సాహికులు పిరమిడ్ ఆకారంలో టోపీ తలపై పెట్టుకుని ఖాళీ స్థలాల్లోనూ ధ్యానం చేస్తున్నారు. నగరంలో ది ఏలూరు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. సొసైటీ ప్రతినెల సభ్యులతో ధ్యాన సభలు నిర్వహిస్తున్నారు.

● **వ్యాపారం దినదినాభివృద్ధి :** కొందరు ప్రజలు పిరమిడ్ ఆకారాలను శక్తి రూపంగా భావిస్తున్నారు. దీంతో వ్యాపార రంగం సైతం దీనిపై దృష్టి నిలిపింది. సాధకుల ఆసక్తి గమనించిన పలు వ్యాపార సంస్థలు పిరమిడ్స్‌ను వివిధ రూపాలు తయారు చేస్తున్నారు. ధ్యాన పిరమిడ్, వాస్తు పిరమిడ్, శక్తి పిరమిడ్ అంటూ పలు పేర్లతో తయారుచేసి విక్రయిస్తున్నారు. మరికొందరు వీటిని ఇళ్లు, పూజా మందిరం, దుకాణాల్లో పెట్టుకుంటున్నారు.



వెదురు పిరమిడ్ కింద ధ్యాన సాధన చేస్తున్న యువకుడు



విక్రయానికి లోహంతో సిద్ధం చేసిన పిరమిడ్



రాగి రేకుతో తయారు చేసిన పిరమిడ్





ఏలూరులో భవనాలపై ధ్యానం చేసుకునేందుకు నిర్మించిన పిరమిడ్లు

మనస్సు ప్రశాంతంగా ఉంటుంది



నేను ప్రతిరోజూ ఫిరమిడ్ కింద ధ్యానం చేస్తాను. దీనివల్ల నాకు ఏన్నో సత్ఫలితాలు కనిపించాయి. మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. అనారోగ్య సమస్యలు దూరమయ్యాయి. ఏకాగ్రత పెరిగింది. ఇప్పుడు మాంసాహారం ముట్టను, శాఖాహారం తీసుకుంటాను. ఎందరో సభ్యులు పిరమిడ్ కింద ధ్యానం చేస్తున్నారు. అందుకే అందరూ పిరమిడ్ కింద ధ్యానం చేయాలని చెబుతున్నాను.

– సాధకురాలు, ఏలూరు

కాస్మిక్ కిరణాల ప్రభావం



మనిషి జీవించడానికి గాలి, నీరు, ఆహారం ఎంత అవసరమో, కాస్మిక్ కిరణాలు అంతో అవసరం. ఈ కిరణాలు భూగర్భం, సముద్రం గర్భంలోనికి సైతం చొచ్చుకుపోగలవు. ఈ కిరణాల వల్లనే భూమి మీద జీవం మనుగడ సాగిస్తోందని శాస్త్రజ్ఞులు నిర్ధారించారు. కాస్మిక్ కిరణాల ప్రసరణ వల్ల జీవం లేదా ఆహారం తొందరగా చెడిపోదు. ఈ కిరణాలు ఒక మార్గం గుండా ప్రసరించడానికి పిరమిడ్ కొంత ఉపకరిస్తుంది. అందుకే ప్రజలు పిరమిడ్ కింద కూర్చొని ధ్యానం చేయాలని భావిస్తున్నారు.

– చంద్రశేఖర్, స్కూల్ డైరెక్టర్

సమష్టి కృషితో సత్ఫలితాలు



సోమవరప్పాడు సెయింట్ జాన్స్ కళాశాలలో ఉపాధ్యాయుల సమ్మేళనం

దెందులూరు: సమష్టి కృషితోనే నిరంతర సాధనతోడైతే నూరు శాతం సత్ఫలితాలు లభిస్తాయని ఏలూరు పీఠం సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ ఇమ్మానియేలు, సెయింట్ జాన్స్ కళాశాల వ్యవస్థాపక కరస్పాండెంట్ ఫాదర్ జీజే చార్లెస్ అన్నారు. ఆదివారం సెయింట్ జాన్స్ విద్యా సంస్థలో ఉపాధ్యాయుల సమ్మేళనం ఏలూరు పీఠం వికార్ జనరల్ డాక్టర్ ఫాదర్ పి.బాల అధ్యక్షతన నిర్వహించారు. ఫాదర్ బాల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో 25 ఏళ్ల క్రితం దివంగత ఏలూరు పీఠాధిపతి జాన్ ములగాడ ఆశీస్సులతో ఫాదర్ జీజే చార్లెస్, ఉపాధ్యాయులు సేవలందించడంతో నేడు రాష్ట్రం నలుమూలల ఎంతో ప్రయోజకులుగా ఉన్నత స్థితిలో పూర్వవిద్యార్థులున్నారని అన్నారు. 25 ఏళ్ల తరువాత అప్పటి నుంచి ఇప్పటి వరకు పనిచేసిన ఉపాధ్యాయులు కళాశాలలో ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. తొలుత కళాశాలలో దివంగతులైన గురువులు, విద్యార్థులకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. వ్యవస్థాపక కరస్పాండెంట్ ఫాదర్ చార్లెస్, ఫాదర్ ఇమ్మానియేలు, జేఎంజే పాఠశాల కరస్పాండెంట్ సునీతను ఫాదర్ బాలను అధ్యాపకులు సన్మానించారు. ఫాదర్ బాల, ఫాదర్ మైఖేల్, ఫాదర్ జోజిరెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ సాధనే లక్ష్యం

దెందులూరు: రాష్ట్రంలో దళితులందరికీ రాజ్యాంగం కల్పించిన ఎస్సీ సబ్‌ప్లాన్ ఫలితాలు అందించడమే ఆల్ ఇండియా దళిత్ రైట్స్ ఫెడరేషన్ (ఏఐడీఆర్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మణి సింగ్ అన్నారు. ఆదివారం దెందులూరులో ఆమె మాట్లాడుతూ ఏఐడీఆర్‌ఎఫ్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించి దళిత హక్కుల దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నామన్నారు.

ఏలూరు నగర బ్రాహ్మణ జేఏసీ సమావేశం

ఏలూరు టౌన్: ఏలూరు నగర బ్రాహ్మణ ఐక్య కార్యాచరణ సమితి సమావేశం నగరంలోని ఆర్ఆర్‌పేట మార్కండేయ వేద పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జేఏసీ గౌరవాధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు హాజరై సమావేశాన్ని ప్రారంభించారు. ఏలూరు నగరంలో బ్రాహ్మణ ఐక్య కార్యాచరణ సమితిని బలోపేతం చేయాలని, జేఏసీలోని సంఘాలకు పలువురు నేతలను ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి నగరంలోని 8 సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఏలూరు అర్చక సమాఖ్య అధ్యక్షుడిగా కందుకూరి రవికుమార్ శర్మ, కార్యదర్శిగా సావిత్రి భూదేవ సంఘం నుంచి చాత్రాతి మదన్‌మోహన్, కోశాధికారిగా హేలాపురి ఆర్యసేవా సమితి నుంచి భోగరాజు శ్రీనివాస ఫణిప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హేలాపురి బ్రాహ్మణ మహిళా సంఘం అధ్యక్షురాలిగా కొంపల్లి తాయారును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఏపీ బ్రాహ్మణ సేవా సంఘాల కార్యదర్శి సత్యవాడ దుర్గాప్రసాద్, మైలవరపు బాలసుబ్రహ్మణ్య శర్మ, బ్రాహ్మణ సంఘాల నగర ప్రముఖులు హాజరయ్యారు.



సమావేశంలో కృష్ణమాచార్యులు, తదితరులు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	40
వంకాయలు (కాంతులు)	56	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	7,10
బెండకాయలు	24	కంద	60
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	36
కాకర కాయలు	40	కీరా దోస	44
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	34	అల్లం	100-160
క్యాబేజీ	26	కొత్తిమీర (కట్ట)	30
క్యారెట్	36	పాలకూర	10
దొండకాయలు	24	చుక్కకూర	10
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	50	గోంగూర	07
గోరుచిక్కుడు	34	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణి	--
అనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	07
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	29

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	09
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	19
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	10
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	16
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	18
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	26
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	17
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

12వ పీఆర్‌సీపై తక్షణం కమిటీని నియమించాలి

ఏలూరు (టూటౌన్): 12వ పీఆర్‌సీపై చర్చించి తక్షణం కమిటీని నియమించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహనముల డ్రైవర్ల కేంద్ర సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీర్మానించింది. స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్‌లోని సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వివిధ జిల్లాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఐఆర్‌కు సంబంధించిన జీవోను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘ సభ్యులు సంఘటితంగా ఉండి తమ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాటం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ప్రభుత్వ డ్రైవర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన ప్రస్తావించారు. ప్రభుత్వం కొత్త వాహనాలను ఏర్పాటు చేయాలన్నారు. పాత వాహనాలకు మరమ్మతులు, ఆయిల్ వంటి సమస్యలను ఎదుర్కొంటున్నామని బడ్జెట్ కూడా రిలీజ్ చేయడం లేదని ఆయన వాపోయారు. అధికారులు మాత్రం అద్దె వాహనాలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నారని అన్నారు. దీని వల్ల ప్రభుత్వానికి తలకుమించిన భారంగా పరిణమిస్తోందన్నారు. అద్దె వాహనాల వల్ల ఒక్కో వాహనానికి 15 సంవత్సరాలకు రూ.1.65 కోట్లు భారం ప్రభుత్వంపై పడుతుందని, అదే కొత్త వాహనం కొంటే 15 సంవత్సరాలకు రూ.80 లక్షలు మాత్రమే ఖర్చు అవుతుందన్నారు. అధికారులు అద్దె వాహనాల్లో తిరుగుతూ డ్రైవర్లను 4వ తరగతి ఉద్యోగులుగా మార్చి అటెండర్లుగా నియమిస్తున్నారని తద్వారా డ్రైవర్లు నెలకు సుమారు రూ.10వేలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కమర్షియల్ ట్యాక్స్ శాఖలో 15 మంది డ్రైవర్లను అటెండర్లుగా మార్చారని వారిని తిరిగి డ్రైవర్లుగా కొనసాగించాలని సమావేశం తీర్మానించింది. వివిధ జిల్లాల్లో డ్రైవర్లకు ప్రభుత్వ రేటుకు ఇళ్ల స్థలాలు ప్రభుత్వం ఇచ్చిందని మిగతా జిల్లాల్లో డ్రైవర్లకు ప్రభుత్వ రేటుకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాసరావు ఇటీవల పదవీ విరమణ చేసిన సందర్భంగా రాష్ట్ర కార్యవర్గం ఆయన్ను ఘనంగా సత్కరించింది. సంఘం ముఖ్య సలహాదారు యండమూరి నాగరాజు రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కె.చిరంజీవి, ఉపాధ్యక్షులు ఎం.రమేష్ బాబు, ఆల్ ఇండియా జోనల్ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి పాపారావు, ఏలూరు జిల్లా అధ్యక్షుడు దత్తు వేణుగోపాలస్వామి, కార్యదర్శి జమలయ్య, ఉపాధ్యక్షుడు తాతారావు, ముఖ్య సలహాదారుడు కె.సాల్మన్ రాజు, పన్నీరు సెల్వం పాల్గొన్నారు.



సీహెచ్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

హిందూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి

ఏలూరు టౌన్: ప్రపంచ వ్యాప్తంగా హిందూ సంస్కృతి, సంప్రదాయాలను, హైందవ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, మన సంస్కృతిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి తనికెళ్ల సత్య రవికుమార్ అన్నారు. విశ్వహిందూ పరిషత్ స్థాపించి 60 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఏలూరు వన్‌టౌన్‌లోని వైఎంహెచ్ఏ హాలులో ఆదివారం షష్ట్యాబ్ది ఉత్సావాలు ఘనంగా నిర్వహించారు. తొలుత ముందూరు స్వామీజీ శ్రీకృష్ణ చరణానంద భారతి స్వామీజీ ప్రసంగిస్తూ విశ్వహిందూ పరిషత్ ప్రపంచ వ్యాప్తంగా ధర్మ పరిరక్షణకు చేపడుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. అనంతరం ముఖ్య వక్తగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో హిందూ సంస్కృతి, సంప్రదాయాల వ్యాప్తి, పరిరక్షణకు విశేష కృషి చేస్తోందని తెలిపారు. వీహెచ్‌పీ సాధించిన విజయాలు, రాబోయే భవిష్యత్ కాలంలో ఎదుర్కొనే సవాళ్లను ఆయన వివరించారు. ఏలూరు నగరంలో విశ్వహిందూ పరిషత్ విస్తరణకు పనిచేసిన గుంటూరి సూర్యనారాయణ మూర్తి, సుదర్శనం రాజగోపాలాచార్యులు, శ్రీమాన్ రంగాచార్యులు, తదితర ముఖ్యనేతల కృషిని గుర్తు చేసుకుంటూ వారి స్ఫూర్తితో భవిష్యత్తులో ధర్మరక్షణకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ మూడు రాష్ట్రాల బాధ్యులు కస్తూరి సూర్యప్రకాష్, జిల్లా అధ్యక్షుడు కాకి సురేష్, కార్యదర్శి గెద్దం నాగరాజు, సీనియర్ కార్యకర్త చక్రధర్ ఉన్నారు.



వైఎంహెచ్ఏ హాల్లో వీహెచ్‌పీ ఉత్సవాల్లో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రవికుమార్

భీమడోలులో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలి

ఏలూరు (టూటౌన్): ప్రముఖ పుణ్య క్షేత్రమైన ద్వారకా తిరుమలకు భక్తులు వెళ్లేందుకు వీలుగా భీమడోలు రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని బీజేపీ నాయకులు కోరారు. ఈమేరకు ఏలూరు స్టేసన్ మేనేజర్ ఎస్ .రమేష్‌కు ఆదివారం సాయంత్రం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నడపన దానభాస్కరరావు మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం ఎక్స్‌ప్రెస్ రైళ్లను భీమడోలులో ఆపాలని కోరారు. ఎంతో ప్రసిద్ధి చెందిన ద్వారకా తిరుమల పుణ్య క్షేత్రానికి ఎంతో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారని భీమడోలు రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగకపోవడంతో వారు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో ఉన్న ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించకపోవడం వల్ల కూడా భక్తులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. భీమడోలు రైల్వే స్టేషన్‌లో వసతులను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నాగం శివ, మరకా రామకృష్ణ పాల్గొన్నారు.



ఏలూరు రైల్వే స్టేషన్ మేనేజర్ రమేష్‌కి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మూఢ నమ్మకాలు విడనాడాలి

ఏలూరు టౌన్: ద్వారకాతిరుమల మత్తేవారిపల్లిలో చేతబడి చేస్తోందనే అనుమానంతో సొంత బంధువులే మద్ది రావమ్మ అనే వృద్ధురాలిపై అమానుషంగా దాడి చేశారు. ఆమె ఏలూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ భైరి నరేష్ ఏలూరు జీజీహెచ్‌లో బాధితురాలిని ఆదివారం పరామర్శించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నమ్మిన నాగార్జునతో కలిసి ఆయన మాట్లాడుతూ ఆధునిక యుగంలో శాస్త్ర సాంకేతిక రంగంలో ఎంతో అభివృద్ధి సాధిస్తున్న తరుణంలో ప్రజలు ఇంకా అజ్ఞానంతో మంత్ర, తంత్రాలపై నమ్మకంతో ఇలా అమానుషంగా దాడులకు పాల్పడడం విచారకరమని తెలిపారు. వృద్ధురాలి పళ్ళు పీకేశారనీ, సుత్తితో ఇష్టారాజ్యంగా కొట్టారనీ, సొంత బంధువులే ఆమెపై దాడి చేయటం బాధాకరమని అన్నారు. ఎంతో అభివృద్ధి చెందిన గోదావరి జిల్లా, అందునా ఏలూరు జిల్లాలో ఇలాంటి సంఘటన చోటుచేసుకోవటం శోచనీయమన్నారు. ప్రభుత్వాలు శాస్త్రీయ విద్యను బోధించాలని, రోగాలపైనా, వైద్యంపైనా ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరారు. మంత్ర, తంత్రాలున్నాయని ఎవరైనా నిరూపిస్తే వారికి రూ.1కోటి బహుమతిగా ఇస్తామని సవాల్ విసిరారు. పోలీస్ శాఖ ఉన్నతాధికారులు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, ప్రజలను చైతన్యవంతం చేయాలని భైరి నరేష్ కోరారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రక్రియను రద్దు చేయాలి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో వ్యవసాయ పంపు సెట్లకు, నివాస గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ నిలుపుదల చేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగి రాష్ట్రంలోని నివాస గృహాలకు విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు పెట్టాలని చూడటం తగదన్నారు. స్మార్ట్ మీటర్ల విషయాన్ని ఏపీ రైతు సంఘం, సీపీఐ తొలి నుంచి వ్యతిరేకిస్తున్నాయన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్ల విషయాన్ని వ్యతిరేకించిందని గుర్తు చేశారు. ఈ ప్రక్రియ వల్ల రాష్ట్ర వినియోగదారులపై రూ.4486.93 కోట్ల భారం పడుతుందన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పట్ల వామ పక్షాలు, ప్రజానీకం నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైనా రాష్ట్రంలో వీటిని అమలు చేయాలనుకోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్ స్మార్ట్ మీటర్ల అంశాన్ని రద్దు చేయకుండా కొనసాగించడానికి సిద్ధమవుతున్నట్టు కనిపిస్తోందన్నారు. సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగంపై స్మార్ట్ మీటర్ల బిగింపు అంశం మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా ఉంటుందన్నారు. తక్షణం రాష్ట్రంలో ఈ బిగింపు ప్రక్రియను నిలిపివేయాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రక్రియ నిలుపుదల చేసేంత వరకు పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.



మాట్లాడుతున్న డేగా ప్రభాకర్